ప్రజాశక్తి

ఆదివారం 1 జూన్ 2025

5

విజయనగరం

నగరంలో యోగాంధ్ర

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ సమీపంలో గాంధీ విగ్రహం వద్ద యోగాసనాలను ప్రదర్శించారు. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇందుమతి యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమాన్ని కమిషనర్ పల్లి నల్లనయ్య సందర్శించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావు, నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టిపిఆర్ఒ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, స్వయం సహాయక సంఘ మహిళలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఇదేంటి రామా?

జిల్లా కలెక్టర్‌కు తెలియకుండా ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించిన ఘటన సంచలనాన్ని రేపింది. ఓ అధికారి చేసిన ఈ సాహసం పట్ల సహచర అధికారులు సైతం విస్తుపోతున్నారు. కలెక్టర్ కనిపించకపోవడంతో జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆరాతీశారు. చివరి వరకు రాకపోవడంతో ఆ తరువాత నిర్వహించాల్సిన వ్యవసాయ శాఖ సమీక్షా సమావేశాన్ని రద్దుచేసుకుని మంత్రి వెళ్లిపోయారు. సమాచారం లేకుండా ఉపకరణాలు పంపిణీ చేయడంతోపాటు అప్పటికప్పుడు పిలుపు కోసం కలవడంతో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆ అధికారి పట్ల ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం.

స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్, ఇతర అధికారులు

- కలెక్టర్‌కు తెలియకుండా కార్యకలాపాలు
- రూ.31 లక్షలు విలువైన ఉపకరణాలు పంపిణీ
- ఎపిసి సాహసానికి నివ్వెరబోయిన జిల్లా అధికారులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలోని ప్రత్యేక అవసరాల విద్యార్థులకు సమగ్ర శిక్ష ద్వారా రూ.31 లక్షల విలువైన ఉపకరణాలను కేటాయించారు. ఇందులో కేంద్రం వాటా 60 శాతం, రాష్ట్రం వాటా 40 శాతం చొప్పున ఉన్నట్టుగా సమాచారం. ఈ పరికరాలు వారం రోజుల క్రితమే జిల్లాకు చేరాయి. కలెక్టరేట్ ప్రాంగణంలోనే స్టోరేజ్ చేశారు. ఈ విషయం కలెక్టర్‌కు చెప్పకుండానే శనివారం ఉదయం 11 గంటలకు పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అదీ కలెక్టరేట్ ఆడిటోరియంలో. కనీసం కలెక్టర్ ప్రొసీడింగ్స్ కూడా తీసుకోలేదు. కనీసం కలెక్టర్ పేషీకి కూడా తెలియనివ్వలేదు. ఆహ్వాన పత్రికలో మాత్రం ఎంచక్కా కలెక్టర్ పేరును రాసుకోవడం గమనార్హం. నేరుగా సమగ్ర శిక్ష ఎపిసి.. జిల్లాకు చెందిన ఎంఎస్ఎంఇ, ఎన్నారై వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఆహ్వానించారు. మంత్రికి విషయం తెలుసో? లేదో.. కానీ, మొత్తానికి ఈ కార్యక్రమానికి హాజరైన కొద్దిసేపటి వరకు కలెక్టర్ కనిపించకపోవడంతో శ్రీనివాస్ ఆరా తీశారు. బహుశా ఎపిసికి అప్పటి వరకు కలెక్టర్‌ను పిలవాలన్న కనీస అవగాహన లేకపోయిందేమో!. మంత్రి ఆరా తీయడంతో ఎపిసి పరుగు పరుగున కలెక్టర్ ఛాంబర్ వద్దకు వెళ్లారు. ఈ కార్యక్రమం కలెక్టర్ షెడ్యూల్లో లేకపోవడంతో అదే సమయంలో నాటు సారా నియంత్రణపై ఎక్సైజ్ తదితర శాఖల అధికారులతో క్యాంప్ ఆఫీస్‌లోనే సమావేశం నిర్వహిస్తున్నారు. అదే సమయంలో పిలుపుకోసం వెళ్లిన ఎపిసికి కలెక్టర్ చుక్కలు చూపించినట్టు సమాచారం. తనకు తెలియకుండా కార్యక్రమం నిర్వహించడంతోపాటు ప్రారంభమయ్యాక పిలుపుకు వస్తావా? అంటూ తీవ్రంగా స్పందించినట్టు తెలిసింది. వివరణ కూడా ఇవ్వాలని ఆదేశించారట. బిక్కమొహంతో వెనుదిరిగిన ఎపిసి కలెక్టరేట్ ఆడిటోరియానికి చేరుకున్నారు. అప్పటికే కార్యక్రమాన్ని నిర్వాహకులు మమా అనిపించారు. మంత్రి గబగబా కొందరికి ఉపకరణాలు అందించి అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ కార్యక్రమం తరువాత వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం ఉన్నప్పటికీ మంత్రి రద్దుచేసుకుని వెళ్లిపోవడం గమనార్హం. బహుశా మంత్రి కలెక్టరేట్‌కు వచ్చే వరకు డిఆర్ఒకు కూడా తెలియదేమో. అప్పటికప్పుడు హడావుడిగా బయటకు వచ్చిన డిఆర్ఒ మురళి.. మంత్రి శ్రీనివాస్‌కు స్వాగతం పలికారు. పక్కనే జెసి తన ఛాంబర్‌లో ఉన్నప్పటికీ ఆయనకీ తెలియకపోవడంతో ఛాంబర్ నుంచి బయటకు రాలేదు. దీంతో మంత్రి, డిఇఒ, డిఆర్ఒ వేదికపై కూర్చొని కార్యక్రమాన్ని మమా అనిపించారు. మంత్రి పాల్గొన్న సమావేశంలో కలెక్టర్ కనిపించకపోవడం, అదే సమయంలో వేరొక సమావేశంలో ఉండటం, కూతవేటు దూరంలో ఉన్న జెసి కూడా రాకపోవడంతో అక్కడున్న ఉపాధ్యాయులందరికీ ఏదో వెలితిగాను, సందేహంగాను అనిపించింది. ఇది ఆ నోటా ఈ నోటా వ్యాప్తి చెందిన అరగంటలో కలెక్టరేట్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులందరికీ తెలిసిపోవడంతో ఎపిసి సాహసం పట్ల ముక్కున వేలేసుకున్నారు. వాస్తవానికి జిల్లా అధికారి స్థాయిలో ఎలాంటి సమావేశం నిర్వహించాలన్నా, కార్యక్రమం చేపట్టాలన్నా కలెక్టర్ ప్రొసీడింగ్స్ తీసుకోవాలి. కనీసం కలెక్టర్‌కు చెప్పకుండానే, ఆయన పేరు ఆహ్వాన పత్రిక వేసుకుని మరీ కలెక్టర్ ఆధీనంలో నడిచే ఆడిటోరియంలో కార్యక్రమం నిర్వహించడం చర్చనీయాంశమైంది.

ఈ విషయమై ఎపిసి రామారావును 'ప్రజాశక్తి' వివరణ కోరగా, కలెక్టర్ వేరే సమావేశంలో ఉండటంతో హాజరుకాలేదని చెప్పారు.

సారారహిత జిల్లాగా విజయనగరం

నెరవేరిన నవోదయం 2.0 లక్ష్యం : కలెక్టర్ ● బెల్టుషాపులను నియంత్రించాలని ఎక్సైజ్ శాఖకు ఆదేశాలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరం జిల్లాను సారారహిత ప్రాంతంగా ప్రకటిస్తూ నవోదయం కమిటీలో తీర్మానించినట్లు కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. జిల్లా అబ్కారీ శాఖ అందించిన సమాచారం మేరకు జిల్లాలోని అన్ని గ్రామాలను, మండలాలను సారారహితంగా గుర్తించినట్లు వివరించారు. నవోదయం 2.0 అమలుపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శనివారం జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సారారహిత జిల్లాగా రూపొందించేందుకు చేపట్టిన చర్యలపై ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు వివరించారు. జిల్లాలోని 27 మండలాల్లో 771 రెవెన్యూ గ్రామాల పరిధిలో 26 సారా ప్రభావిత గ్రామాలను గుర్తించామని చెప్పారు. 414 పాత ముద్దాయిలను, 26 మంది బెల్లం వర్తకులను గుర్తించి బైండోవర్ చేశామని తెలిపారు. నేరచరిత్ర గల గ్రామాలను ఎ, బి, సిలుగా వర్గీకరించి ఆ గ్రామాల బాధ్యతను దత్తత అధికారులకు అప్పగించామన్నారు. నవోదయం కార్యక్రమంలో ఆయా గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలను భాగస్తులుగా చేయడం ద్వారా ఈ కార్యక్రమంలో ఫలితాలు సాధించగలిగామన్నారు.

జిల్లాలో బెల్టుషాపులు అధికంగా ఉంటున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని విచ్చలవిడిగా ఏర్పాటు చేయకుండా నియంత్రించాలని కలెక్టర్.. ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. అవసరమైతే తాను కొన్ని ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కె.వి.వి.ఎన్.బాబ్జీరావు, సహాయ సూపరింటెండెంట్ దొర, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జీవనరాణి, గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

నగరంలో భారీ వర్షం

లోతట్టు ప్రాంతాల్లో జలమయం ● ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. సుమారుగా గంటన్నర పాటు వర్షం కురవడంతో ఒక్కసారిగా రోడ్లపై, కాలువల్లో నీరు ఏరులై ప్రవహించింది. నగరంలోని రాజీవ్ గాంధీ నగర్, పెద్దచెరువు దిగువ ప్రాంతమైన వినాయక్ నగర్, దాసన్నపేట, కామాక్షి నగర్ వంటి ప్రాంతాల్లో నీరు వీధుల్లో ఉప్పొంగి ప్రవహించింది. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. దీంతో ఆయా కాలనీల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం తగ్గిన వెంటనే రోడ్లపైకి చేరిన నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది.

రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

ఈ పరిణామంతో నగరంలో డ్రెయినేజీ వ్యవస్థ, పూడిక తీతపై ఆందోళన వ్యక్తమవుతోంది. రుతుపవనాలు ఆగమనంతో కొద్ది రోజులుగా జిల్లాలో, నగరంలో రోజులో ఏదో ఒక సమయంలో వర్షం కురుస్తోంది.

ఇంటిలోకి చేరిన నీరు

వికలాంగుల అభ్యున్నతికి కృషి

మంత్రి శ్రీనివాస్ ● సమగ్ర శిక్ష ద్వారా ఉపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

వికలాంగులు, ప్రత్యేకావసరాలు గల పిల్లల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. పాఠశాల విద్యాశాఖ- సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సహిత విద్య కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు భారీ ఎత్తున ఉపకరణాల పంపిణీ కార్యక్రమం కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం చేపట్టారు. హియరింగ్ ఎయిడ్స్-35, కమోడ్‌తో కూడిన వీల్‌చైర్లు 13, టిఎల్ఎం ప్రైమరీ కిట్లు 11, సెకండరీ కిట్లు 10, క్రచ్ ఎల్‌బోలు 2, ట్రైవీలర్ సైకిళ్లు 2, రోల్లేటర్ అడల్ట్ 3, చైల్డ్ 2, ఫోల్డింగ్ వీల్‌చైర్లు 8, బ్యాటరీ ట్రైసైకిళ్లు 2, విభిన్న ప్రతిభావంతుల వీల్‌చైర్‌ను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అవకాశాలు కల్పిస్తే వికలాంగులు కూడా ఇతరులతో సమానంగా ఉన్నత స్థానాలను సాధిస్తారన్నారు. వారి అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో అవకాశాలను కల్పిస్తున్నాయని చెప్పారు. గత ఏడాది సమగ్ర శిక్ష ద్వారా సుమారు రూ.1.20 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు.

వికలాంగ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

అనంతరం డిఆర్ఒ మురళి, డిఇఒ మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఎపిసి డాక్టర్ రామారావు మాట్లాడారు. స్పెషల్ ఒలింపిక్స్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన జిల్లాకు చెందిన విద్యార్థులు అడ్డ తోషిని, కె.సంతు, ఈనుమల యశ్వంత్, రాజాన అజయ్, కొప్పర విజయ్‌కుమార్, కోచ్ లు పి.సునీల్, బంగారునాయుడును మంత్రి సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షాలను ఎదుర్కొనేందుకు సన్నద్ధం

- ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకూడదు
- 3 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

వచ్చే మూడు నెలలపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, దీనిని ఎదుర్కొనడానికి యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ తన ఛాంబర్ నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శాఖల వారీగా సన్నద్ధతపై ఆదేశాలు జారీ చేశారు. వర్షాల కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకూడదని స్పష్టం చేశారు. అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలే కాకుండా, ఒకవేళ ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే, ఆ తరువాత చేపట్టాల్సిన చర్యలపై కూడా సన్నద్ధంగా ఉండాలని సూచించారు. దీనికోసం అన్ని శాఖలు క్షేత్రస్థాయిలో పర్యటించి, మూడు రోజుల్లోగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. సన్నద్ధతపై ఆర్‌డిఒలు వారానికోసారి తమ డివిజన్‌లో సమీక్ష నిర్వహించి నివేదికను అందించాలని సూచించారు.

నీటి పారుదల శాఖ

జిల్లాలో వర్షాల కారణంగా చెరువులకు, కాలువలకు ఎక్కడా గండి పడకుండా చూడాలని, దీనికోసం ముందుగానే వాటిని పరిశీలించి నివేదిక తయారు చేయాలని కలెక్టర్ చెప్పారు. మండల స్థాయిలో ఎంపిడిఒ, తహశీల్దార్, నీటిపారుదలశాఖ ఎఇలు కమిటీగా ఏర్పాటై, క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని సూచించారు. గండి పడే అవకాశం ఉన్నచోట తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మున్సిపాలిటీలు

మున్సిపల్ ప్రాంతాల్లోని అన్ని రోడ్లు, డ్రెయిన్లను పరిశీలించాలని, లోతట్టు ప్రాంతాలు మునిగిపోకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రోడ్లు కొట్టుకుపోయి ప్రజలు ఇబ్బంది పడకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని అన్నారు. వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చూడాలన్నారు. తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి పెట్టాలన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

పంచాయతీ శాఖ

గ్రామాల్లో ప్రతిరోజూ పారిశుధ్య పనులను నిర్వహించాలని, దోమలు విజృంభించకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో మలేరియా, డెంగీ, విష జ్వరాలు విజృంభించే అవకాశం ఉందని, దానిపై దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, ఇఒపిఆర్‌డిలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

వైద్యారోగ్యశాఖ

వ్యాధులు విజృంభించకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. అన్ని రకాల మందులను ముందుగానే సిద్ధంగా ఉంచాలన్నారు. అవసరమైతే వైద్య శిబిరాలను నిర్వహిచేందుకు సైతం సన్నద్ధం కావాలన్నారు. నిరంతరం వైద్య పరీక్షలను నిర్వహించాలని, ఆశా, ఎఎన్ఎంలు ప్రతిరోజూ గ్రామాల్లోకి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేయాలని ఆదేశించారు.

గ్రామీణ నీటి సరఫరా

వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ఎక్కడా నీటి కొరత తలెత్తకూడదని కలెక్టర్ స్పష్టంచేశారు. ప్రతిరోజూ క్లోరినేషన్ చేయాలని, ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. చేతి బావులవద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉండేటట్టు చూడాలన్నారు. తాగునీటి పథకాల దగ్గర నీరు కలుషితం కాకుండా చూడాలని ఆదేశించారు.

విద్యుత్తు శాఖ

వర్షాలు, ఈదురు గాలుల కారణంగా విద్యుత్తు సరఫరా నిలిచిపోవడం, స్తంభాలు నేలకొరగడం, వైర్లు తెగిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం తదితర ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. వీటిని వీలైనంత వరకు నివారించేందుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైన సామగ్రిని సిద్ధంగా ఉంచాలని చెప్పారు. దీనికోసం ముందుగానే గ్రామాల్లో పర్యటించి పాడైన విద్యుత్తు స్తంభాలను, వేలాడే వైర్లను గుర్తించాలని సూచించారు.

రెవెన్యూ శాఖ

వర్షాల వల్ల ప్రమాదాలు జరగకుండా సిద్ధంగా ఉండటంలో రెవెన్యూ శాఖది కీలక పాత్రని కలెక్టర్ అన్నారు. పిడుగుల బారిన పడకుండా ప్రజలను చైతన్యవంతులను చేయాలని చెప్పారు. కల్వర్టులు, వంతెనల వద్ద నీటి ప్రవాహం వల్ల ప్రమాదాలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, తాళ్లతో బారికేడ్లు కట్టి ప్రజలను హెచ్చరించాలని చెప్పారు.

జనాభా నియంత్రణ విధానంపై సర్వే

జనాభా నియంత్రణ విధానాన్ని రూపొందించేందుకు ప్రజాభిప్రాయాన్ని తెలుసుకొనేందుకు ప్రభుత్వం సిద్ధమైందని కలెక్టర్ చెప్పారు. దీనిలో భాగంగా ప్రశ్నావళిని రూపొందించిందని, క్యూఆర్ కోడ్ ద్వారా ఈ ప్రశ్నపత్రాన్ని పూర్తి చేయాల్సి ఉంటుందని చెప్పారు. జిల్లాలో ఈ సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు.

మూడు రోజులపాటు వర్షాలు

జిల్లాలో ఈ మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ నుంచి హెచ్చరికలు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా వంగర, రేగిడి, తెర్లాం మండలాల్లో భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. వీటిని ఎదుర్కొనడానికి ఈ మండలాల అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కేంద్రం నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, సిపిఒ పి.బాలాజీ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

ప్రతిరోజూ ప్రసవాల సమాచార సేకరణ

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో రోజువారీగా జరుగుతున్న ప్రసవాలను నమోదు చేసి, ప్రతిరోజూ సమాచారం సేకరించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్... జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిని ఆదేశించారు. జిల్లాలోని ప్రయివేటు ఆస్పత్రుల్లో జరిగిన గర్భస్రావాల సమాచారం కూడా వెంటనే అందజేయాలని ఆదేశించారు. ఏప్రిల్ నెలకు సంబంధించి జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో జరిగే ప్రసవాల సమాచారాన్ని వెంటనే నివేదిక రూపంలో అందజేయాలన్నారు. స్కానింగ్ కేంద్రాల్లో ప్రతిరోజూ ఎన్ని స్కానింగ్‌లు చేపడుతున్నారనే అంశంపైనా నివేదిక ఇవ్వాలన్నారు.

లింగ నిర్ధారణ నిరోధక చట్టం అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా స్కానింగ్ కేంద్రాల ద్వారా లింగ నిర్ధారణ పరీక్షల సమాచారం తెలిసే అవకాశం లేకుండా చేపట్టిన చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. అన్ని స్కానింగ్ కేంద్రాల్లోనూ లింగ నిర్ధారణ సమాచారం తెలియజేయరనే బోర్డులు సందర్శకులకు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని చెప్పారు. స్కానింగ్ కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలకు ఆయా ఆస్పత్రులు వసూలుచేసే ఛార్జీల వివరాలతో ధరల పట్టికను ప్రదర్శించాలని తెలిపారు. స్కానింగ్ కేంద్రాలపై వైద్య ఆరోగ్యశాఖకు పూర్తిస్థాయిలో నియంత్రణ ఉండాలని స్పష్టంచేశారు. కొత్తగా స్కానింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఆయా రెవెన్యూ డివిజనల్ అధికారులు తనిఖీ చేసి నివేదిక ఇచ్చిన తర్వాతే వాటికి అనుమతులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

సమావేశంలో డిఎంహెచ్ఒ జీవనరాణి, ఎడిఎంహెచ్ఒ కె.రాణి, డిడిఎంహెచ్ఒ ఎన్.సూర్య నారాయణ, ఆర్‌బిఎస్‌కె పిఒ బి.వి.బి. సుబ్రహ్మణ్యం, లింగనిర్ధారణ చట్టం అమలు అధికారి ఆర్.అచ్యుతకుమారి, డిపిహెచ్ఎన్ఒ ఎం.సత్యవతి, వైద్యాధికారి జి.వెంకటేష్, డిఇఎంఒ వి.చినతల్లి, ఎస్ఒ ఎం.ధర్మారావు, దిశ స్టేషన్ ఎస్ఐ నరసింహారావు, ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ డిసి బాబ్జీరావుకు కలెక్టర్ సత్కారం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తూ శనివారం ఉద్యోగ బాధ్యతల నుంచి విరమణ చేసిన కె.వి.వి.ఎన్ బాబ్జీరావును జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సత్కరించి అభినందించారు. ఎక్సైజ్ అధికారులతో సమావేశం అనంతరం ఆయనను కలెక్టర్ సత్కరించారు. ఉప కమిషనర్‌గా ఉద్యోగ విరమణ చేస్తున్న బాబ్జీరావు.. 39 ఏళ్ల పాటు ఎక్సైజ్ శాఖలో వివిధ హోదాల్లో సేవలందించారు. ఈ జిల్లాలో ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా, సహాయ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌గా చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు, సహాయ సూపరింటెండెంట్ దొర, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ డిసి బాబ్జీరావును సత్కరిస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

యోగా పేరిట సర్కారు మైండ్‌గేమ్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తాటిచెట్టు ఎందుకు ఎక్కావంటే, దూడకు గడ్డి కోసమే! అన్నాడట వెనుకటికి ఓ వ్యక్తి. వాస్తవానికి తాటిచెట్టుపై గడ్డి ఉండదు కదా? ఉంటే గింటే తాటి కాయలు, కమ్మలు ఉంటాయి. ఆ విషయాన్ని తెలియనీయకుండా దూడకు అవసరమైన గడ్డి కోసమే అని తెలివితేటలు ప్రదర్శించాడట. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగా పేరిట అచ్చంగా అటువంటి మైండ్ గేమ్ ఆడుతున్నాయి. యోగా, సంగిడి, కుస్తీ పోటీలు పూర్వం నుంచీ ఉన్నాయి. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఒకప్పుడు ఉండేవి. వీటిని బల ప్రదర్శన శాలలని పిలిచేవారు. విజయనగరంలోని కలియుగ భీముడుగా పేరు గాంచిన కోడి రామ్మూర్తి బల ప్రదర్శనశాల చరిత్ర దేశంలోనే పేరుగాంచింది. ఈ లెక్కన యోగా అనేది శారీరక వ్యాయామంలో ఒక భాగం అనేది వేరుగా చెప్పనక్కర్లేదు. శాస్త్ర, సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందినట్టే శారీరక వ్యాయామంలోనూ అనేక మార్పులు వచ్చాయి. ఇందులో భాగంగానే వాకింగ్ ట్రాక్‌లు మొదలుకుని, జిమ్‌ల వరకు ప్రయివేటు రంగంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఒక్క విజయనగరంలోనే నెలవారీగా రూ.కోట్లలో వ్యాపారం సాగుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో జిమ్‌లు, పార్కులు ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం మదుపూ మరమ్మతుల్లేని యోగాను తెరపైకి తెచ్చింది. అంతటితో ఆగలేదు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ యోగా సర్వరోగ నివారిణి అన్నట్టుగా జనాన్ని నమ్మబలుకుతోంది. ఇందులో భాగంగానే ఏటా యోగా కార్యక్రమాలకు పిలుపునిచ్చిన కేంద్రం... ఈ ఏడాది మే 21 నుంచి జూన్ 21వరకు నెల రోజులపాటు యోగా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. అంతే తడవుగా రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ఎద్దు ఈనిందంటే దూడను కళ్లంలో కట్టేయమన్నట్టుగా కేంద్రం ఇలా పిలుపునిచ్చిందో లేదో వెంటనే యోగాంధ్ర.. అంటూ ప్రకటించింది. కార్యక్రమం ముగింపు సందర్భంగా ఈ నెల 21న ఏకంగా ప్రధాని నరేంద్ర మోడీనే విశాఖపట్నం వస్తారట. ఆ రోజు రెండు లక్షల మందితో యోగాసనాలు వేయించాలని లక్ష్యం కూడా పెట్టేసుకున్నారు. ముందూ మునుపు ఇటువంటి కార్యక్రమాలు చేశారా? అంటే ఇటువంటివేమీ లేదనే చరిత్ర చెబుతోంది. వ్యాయామంపై ప్రభుత్వానికి అంత చిత్తశుద్ధి ఉంటే, పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించేది. ఆ పనిచేయకుండా క్రమబద్ధీకరణ పేరుతో ఆ పోస్టులనే లేపేసింది. అయినా, యోగాను ఎందుకు ఇంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారంటే ప్రధాని మోడీని ప్రసన్నం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం తహతహలాడుతోంది. కార్యక్రమం అంతలా నిర్వహించాలంటే మరి జనం రావాలి కదా?. ఇందుకు కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, వారి కార్యకర్తలు ఎలాగూ ముందుకు వచ్చే అవకాశం లేదు. ఎందుకంటే వారికి తెలుసు యోగా అనేది సర్వరోగ నివారిణి కాదని. ఇందుకోసం వైద్యారోగ్య శాఖ సూచనలు, సలహాలు ఉన్నాయని. ఇదంతా యోగా ముసుగులో బిజెపి చేస్తున్న మత ప్రచారమని. కాబట్టి ప్రధాని నుంచి ప్రశంసలు పొందాలంటే సామాన్య ప్రజానీకాన్ని నమ్మబలకాలి. శిక్షణలు ఇవ్వాలి. ఇలా అయితేనే ప్రధాని విశాఖపట్నం వచ్చినరోజు పెద్ద ఎత్తున జనం కదిలేందుకు అవకాశం ఉంటుంది. ఇందుకోసం మన జిల్లా అధికార యంత్రాంగం పడరాని పాట్లు పడుతోంది. ఒకటీ రెండూ కాదు సుమా..! కొన్ని శాఖల అధికారుల సమన్వయంతో యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. డిఆర్‌డిఎ పీడీని సమన్వయకర్తగా నియమించారట. ఇప్పటికే యోగాంధ్ర, యోగా స్ట్రీట్ పేరిట గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా యోగా శిక్షణలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. చివరికి వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు కూడా నిర్వహిస్తున్నారు. బహుశా అధికార పార్టీల నాయకులు, కార్యకర్తలు యోగాసనాలకు ముందుకు రావడం లేదో? ఏమో మరి. యోగాసనాలకు మించి రెక్కలు ముక్కలు చేసుకుని ఉపాధి కూలీలు, వ్యవసాయ పనులు చేసుకుంటున్న 5వేల మందితో యోగాసనాలు నిర్వహించేందుకు రెడీ అవుతున్నారు. ఈ నేపథ్యంలో కొద్దిరోజులుగా ఉపాధి పనుల పర్యవేక్షణ కన్నా ఈ కార్యక్రమం నిర్వహణే ప్రాధాన్యత అంశంగా మారిపోయింది.



ఇది అసలు అజెండా

యోగా ప్రదర్శనల కోసం అధికారుల తిప్పలు ఈ విధంగా ఉంటే, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అజెండా వేరుగా ఉంది. బిజెపి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ముఖ్యంగా విద్య, వైద్య రంగాల ప్రయివేటీకరణపై ప్రశ్నించే గొంతులు మూగబోవాలంటే ఆర్‌ఎస్ఎస్ బోధిస్తున్న ఖర్మ సిద్ధాంతం జనానికి ఎక్కించాలి. ఓంకార నాదంతో మొదలుపెట్టే యోగా ముసుగులో మత ప్రచారం చేయడం చాలా సులువుగా ఉంటుంది. సరిగ్గా బిజెపి, దాని మాతృ సంస్థ ఆర్‌ఎస్ఎస్‌కు కావాల్సింది కూడా ఇదే. ప్రజలంతా యోగాసనాల్లో ఉంటే, వైద్యరంగాన్ని కార్పొరేట్ చేతుల్లో పెట్టడం కూడా సులువే. స్వామికార్యంతోపాటు స్వకార్యం అన్నట్టుగా ఇప్పటికిప్పుడు వైద్యరంగం ప్రయివేటీకరణపై వ్యతిరేకతనూ తగ్గించుకోవచ్చు. భవిష్యత్తులో ఖర్మ సిద్ధాంతంలోకి నెట్టి, ప్రశ్నించే తత్వాన్నే లేకుండా చేయొచ్చన్నది వారి భావన. ఇటువంటి కుయుక్తులు ఉత్తరాంధ్రలోనూ, ముఖ్యంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలోనూ ముందుకుసాగే పరిస్థితి లేదని పబ్లిక్ టాక్.

రికార్డులను తనిఖీ చేస్తున్న జడ్జి రోహిణిరావు

వసతి గృహాల్లో జడ్జి తనిఖీలు

ప్రజాశక్తి - బాడంగి

స్థానిక బిసి, ఎస్సి ప్రభుత్వ వసతి గృహాలను జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణిరావు శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో కష్టపడి చదవాలని విద్యార్థులను ఆమె కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని సూచించారు.

అక్రమ కనెక్షన్లు తొలగించాలి

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - వేపాడ

అక్రమంగా తాగునీటి కుళాయిల నుంచి పెట్టిన కనెక్షన్లను తొలగించాలని ఇఒపిఆర్‌డి రవికుమార్ ఆదేశించారు. మండలంలోని ఎస్‌కెఆర్‌పురం ఎస్‌సి కాలనీలో తాగునీటి ఇబ్బందులు పడుతున్నారని ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన శనివారం గ్రామంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న అక్రమ కనెక్షన్లను పంచాయతీ కార్యదర్శి కన్నంనాయుడు, సర్పంచ్ జి.దేవి గుర్తించి వెంటనే తొలగించాలన్నారు. ఎగువన ఉన్న గ్రామం నుంచి దిగువన ఉన్న ఎస్‌సి కాలనీకు తాగునీరు వెళ్లాలంటే కచ్చితంగా అక్రమంగా ఏర్పాటు చేసిన కనెక్షన్లను తొలగించాల్సిందేనన్నారు. తద్వారా ఎస్‌సి కాలనీకు తాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు.

అంగన్వాడీ కేంద్రాలకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - తెర్లాం

మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రానికి 2025 -26 సంవత్సరానికి గాను ప్రీ స్కూల్ మెటీరియల్ శనివారం అందించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఉషారాణి ముందుగా సెక్టర్ మీటింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు. అంగన్వాడీ కేంద్రాలను సక్రమంగా నడిపించాలని, ప్రీస్కూల్ పిల్లలకు సరైన విద్యను అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. అంగన్వాడీలో పూర్తి చేసుకున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి డిపోలోనే రేషన్

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలో మొత్తం 58 రేషన్ షాపులు ద్వారా ఒకటో తారీఖు నుంచి రేషన్ సరుకులు సరఫరా చేస్తామని తహశీల్దార్ హేమంత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 5ను అమలు చేస్తూ రేషన్ షాపుల ద్వారా వస్తువులు పంపిణీ చేస్తామన్నారు. ఇంతకుముందు ఎండియు వాహనం ద్వారా సరఫరా చేసేవారని వాటిని ప్రభుత్వం తొలగించి దుకాణాలు ద్వారా పంపిణీకి ఏర్పాట్లు చేసిందని లబ్ధిదారులు గమనించాలని చెప్పారు. 65 సంవత్సరాలు పైబడిన వారికి, వికలాంగులకు ఒకటో తారీకు నుంచి ఐదో తారీకు లోపు ఇంటికి తీసుకొచ్చి సరుకులు అందిస్తారన్నారు.

మడ్డువలసలో భారీ అన్నదానం

ప్రజాశక్తి - వంగర

మండలంలోని మడ్డువలసలో శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ రెండవ వార్షికోత్సవం సందర్భంగా శనివారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మగ్గూరు, సంగాం, జగన్నాథవలస, నీలయ్యవలస గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.

4న టేకు చెట్ల బహిరంగ వేలం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్‌కోట మహిళ వసతి గృహ నిర్మాణ స్థలంలో ఆటంకంగా ఉన్న టేకు, ఇతర చెట్లను ప్రభుత్వ అటవీ శాఖ సూచనలతో జూన్ 4న బహిరంగ వేలం వేస్తామని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల కొనుగోలుదారులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పేరున రూ.5వేలు ధరావత్తుగా చెల్లించి బుధవారం ఉదయం 10 గంటలకు కళాశాల ఆవరణలో నిర్వహించే బహిరంగ వేలంలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

క్రీడలతో బంగారు భవిష్యత్తు : డిఎస్‌పి

ప్రజాశక్తి - బొబ్బిలి

పోటీలను ప్రారంభిస్తున్న డిఎస్‌పి భవ్యరెడ్డి

క్రీడలలో యువతకు బంగారు భవిష్యత్ ఉంటుందని డిఎస్‌పి భవ్యరెడ్డి అన్నారు. స్థానిక శ్రీకళాభారతి ఆడిటోరియంలో శనివారం తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలలో మంచి భవిష్యత్ ఉంటుందని, యువత, విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పోటీలలో జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు, తైక్వాండో క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్, కోచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

నూర్పిడి యంత్రం బోల్తా

వంగర: మండలంలోని మగ్గూరు బస్ స్టాండ్ సమీపంలో శనివారం నూర్పిడి యంత్రం బోల్తా పడింది. కళ్ళం నుంచి ప్రధాన రహదారికి చేరుకునే క్రమంలో కళ్ళంలో గోతులు ఉండడంతో బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదమూ జరగలేదు. అయితే ఈ నూర్పుడి యంత్రం రోడ్డుపై పడిపోవడంతో కొంత సమయం రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికులు స్పందించి పొక్లెయినర్‌తో నూర్పిడి యంత్రాన్ని రోడ్డు నుంచి బయటికి తొలగించి అక్కడి నుంచి తరలించారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న సిఐ చిన్నంనాయుడు

ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలి

బొబ్బిలి: ఎంఆర్‌పి ధరలకే మద్యం అమ్మాలని ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు కోరారు. పట్టణంలోని మద్యం షాపులను శనివారం తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి మద్యం అమ్మకాలు జరపాలన్నారు. ఎంఆర్‌పి ధరలు పెంచిన, సమయపాలన పాటించకపోయినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని రకాల బ్రాండ్లు అమ్మాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

మహిళకు ఆర్థిక సాయం

విజయనగరం టౌన్: పేగు వ్యాధితో బాధపడుతున్న నగరానికి చెందిన విజ్జపు బంగారులక్ష్మికి జిల్లా ఆర్యవైశ్య మిత్రుల చారిటీ గ్రూపు అండగా నిలిచింది. శనివారం పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద బంగారు లక్ష్మి కుమార్తె శ్రావణికి గ్రూపు అధ్యక్షులు ఆలవెల్లి శేఖర్ రూ.50 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో కోశాధికారి సముద్రాల నాగరాజు, ఎ.వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

యోగా పట్ల చైతన్యం కలిగించేలా..

విజయనగరంటౌన్ : యోగా పట్ల ప్రజలకు మరింత చైతన్యం కలిగించే దిశగా నగరపాలక సంస్థ పలు ప్రాంతాలలో యోగా చిత్రాలను గీయిస్తోంది. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో నగరంలోని ప్రధాన కూడళ్లలో యోగా చిత్రాలు ఎంతో ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంటున్నాయి. ప్రముఖ చిత్రకారులు వీటిని చిత్రీకరిస్తున్నారు. యోగా విశిష్టత అందరికీ తెలిసే విధంగా యోగా ప్రక్రియలోని వివిధ రకాల చిత్రాలను చిత్రీకరిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

తాగునీటికి కటకట

- పలు గ్రామాలలో తాగునీటికి అవస్థలు
- పైపులైన్లు నిర్వహణ లోపమే కారణం
- చలమ నీరే ఆధారంగా జీవనం

ప్రజాశక్తి - వంగర

మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు విస్తారంగా కురుస్తున్నా గుక్కెడు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో స్వచ్ఛమైన నీటిని తాగాలని వైద్యులు సూచిస్తున్నా ఆ స్థాయిలో అధికారులు తాగునీటిని అందించడంలో విఫలమవుతున్నారు. రక్షిత మంచినీటి పథకాలున్నా పైపులైన్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో తాగునీరు సకాలంలో అందడం లేదు. ఫలితంగా చలమనీరే ఆధారంగా జీవనం సాగిస్తున్నారు.

మండలంలో ఉన్న అన్ని గ్రామాలకు తాగునీటిని అందించేందుకు 15 ఏళ్ల క్రితం అప్పట్లో మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ చొరవతో మండలంలోని మెట్ట మగ్గూరు సమీపంలో 10 కోట్ల రూపాయలతో రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దాని నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పలు గ్రామాల్లో తాగునీటికి అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని అన్ని గ్రామాలకు తాగునీరు సక్రమంగా అందే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మండలంలో వివిధ గ్రామాల్లో నివసిస్తున్న సుమారు 50 వేల మంది తాగునీటి కష్టాలు పడుతున్నారు. మెట్ట మగ్గూరు సమీపంలో రక్షిత మంచినీటి పథకం ఉన్నప్పటికీ ఆ గ్రామంలో ఎస్‌సి, ఎస్‌టి బీసీ కులాలకు చెందిన మొత్తం నాలుగు వీధులకు సంబంధించి ఒకే ఒక్క వీధి కుళాయి వేయడంతో ఆ కుళాయి ద్వారా వచ్చిన నీరు ఎటూ సరిపోవటం లేదని, ఆ నీరు కూడా సక్రమంగా ఇవ్వకపోవడంతో అవస్థలు పడుతున్నామని, పోనీ అలా అని మోటార్ ఉన్న వారి దగ్గరకు బిందుడు నీటి కోసం వెళితే విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని నీటిని కూడా ఎవరు ఇవ్వటం లేదని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీటిని అందించాలని నిరసన వ్యక్తం చేశారు.

శివ్వాంలో వీధుల్లో కుళాయిలు ఉన్నప్పటికీ వాటి ద్వారా గత 20 రోజులుగా తాగునీరు ఇవ్వకపోవడంతో అక్కడ ప్రజలు నాగావళి నది సమీపంలో చలమ నీటిని తెచ్చుకుంటున్న పరిస్థితి. కొట్టిశలో పైప్ లైన్లు సక్రమంగా లేకపోవడంతో కుళాయి ద్వారా కొద్దిపాటి నీరు వస్తుందని అది ఎప్పుడు ఆగిపోతుందో తెలియని పరిస్థితి అని అక్కడ ప్రజలు వాపోతున్నారు. నీలయ్యవలసలో తాము తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివిఆర్ పేట పంచాయతీలో వాటర్ ట్యాంక్ నిర్మించినప్పటికీ పైప్‌లైన్ వేయకపోవడంతో కుళాయి నీరంటేనే తమకు తెలియదని కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తారని ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నామని ఎవరూ పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటింటికి కుళాయిలు హామీలకే పరిమితం

జలజీవన్ మిషన్‌లో భాగంగా మండలంలో ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికీ కుళాయిలు వేసి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని గత ప్రభుత్వం నుండి ప్రతి సమావేశాల్లోనూ సభల్లోనూ పలుమార్లు హామీలు ఇచ్చినప్పటికీ ఆ హామీలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. మండలంలోని కొప్పర, కొత్తవలస, శివ్వాం, రుషింగి తదితర గ్రామాల్లో ఇంటింటి కులాయిలు వేయకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్చిన హామీలను ఇప్పటికైనా అమలు చేసి ప్రతి ఇంటికి కుళాయిలు వేసి తాగునీరు అందించాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఈ విషయంపై ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇని ఫోన్లో వివరణ కోరగా తాను మండలానికి కొత్తగా వచ్చి వీధుల్లో చేరానని, బదిలీలకు అవకాశం ఉన్నందున ఆ పనిలో ఉన్నానని ఎంపిడిఒతో మాట్లాడి చెబుతానని దాటవేశారు.

శివ్వాం వద్ద నాగావళి నదిలో చలమ నీటిని తోడుతున్న మహిళలు

వరి విత్తనాలు ఎప్పుడు వస్తాయో..?

ఎదురుచూస్తున్న రైతన్నలు

ప్రజాశక్తి - వంగర

మండలానికి వరి విత్తనాలు ఎప్పుడు వస్తాయోనని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఎదురుచూస్తున్నారు. ఇటీవల వర్షాలు విస్తారంగా కురవడంతో పాటు, ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు పదివేల ఎకరాలకు పైబడి వరినారు, ఎదలు వేసేందుకు తమ తమ పొలాలలో రైతులు ఇప్పటికే దుక్కులు వేసి సిద్ధం చేశారు. అయితే వర్షాలు అతీతంగా కురవడం వల్ల కొంతమంది రైతులు తమ పొలాలలో దుక్కులు వేయని పరిస్థితి ఉంది. ఎప్పుడు తెరుపుగా ఉంటే అప్పుడు పొలాలల్లో దుక్కులు వేసి విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి వరి విత్తనాలు ఇంత వరకూ ఆర్‌ఎస్‌కెలకు చేరుకోలేదు. దీంతో వరి విత్తనాలు ఎప్పుడు వస్తాయి? ఏయే విత్తనాలు వస్తాయో రైతులకు తెలియని పరిస్థితి. ఇది ఇలా ఉంటే, ప్రైవేటు వ్యాపారులు మాత్రం ఇప్పటికే కొన్ని గ్రామాలలో విత్తనాలు నిల్వ చేసికొని అమ్ముతున్నారని రైతులు చెబుతున్నారు. ఇలాంటి వాళ్ల దగ్గర నకిలీ విత్తనాలు తీసుకుంటే మోసపోతామని కొంతమంది రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని వరి విత్తనాలు రైతులకు సకాలంలో అందించే విధంగా చర్యలు చేపట్టాలని వివిధ గ్రామాలకు చెందిన రైతులు కోరుతున్నారు.

ఖరీఫ్‌కు రైతులు సిద్ధం చేసుకున్న నారు మడి

ప్రతిపాదనలు పంపించాం

ఎంటియు 1064, ఎంటియు 1121, స్వర్ణ 7029, ఎంటియు 1224, ఎంటియు 1318, శ్రీకాకుళం సన్నాలు, ఆర్జిల 2537 రకాల వరి విత్తనాలు మొత్తం 700 క్వింటాలు కావాలని ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. జూన్ 5వ తేదీ లోపు విత్తనాలు వచ్చే అవకాశం ఉంది. వచ్చిన వెంటనే పంపిణీ చేస్తాం.

తట్టికోట కన్నబాబు, వ్యవసాయ అధికారి వంగర

అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రస్తుత వర్షాకాలంలో వచ్చే మూడు నెలలపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, దీనిని ఎదుర్కొన డానికి యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని తహశీల్దారు పి.సుదర్శన రావు ఆదేశించారు. వివిధ శాఖల మండల అధికారులు, శాఖల వారీగా సన్నద్ధతపై ఆయన శనివారం ఆదేశాలు జారీ చేశారు. వర్షాల కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకూడదని, ముందు జాగ్రత్త చర్యలే కాకుండా, ఒకవేళ ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే, ఆ తరువాత చేపట్టాల్సిన చర్యలపై కూడా సన్నద్ధంగా ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి, మూడు రోజుల్లోగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. సన్నద్ధతపై విఆర్‌ఒలు తమ రెవెన్యూ గ్రామంలో సమీక్ష నిర్వహించి నివేదికను అందించాలని సూచించారు.

టిడిపి, వైసిపి కౌన్సిలర్ల మధ్య రగడ

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో టిడిపి, వైసిపి కౌన్సిలర్లు మధ్య వాగ్వివాదం జరిగింది. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో శనివారం చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైసిపి కౌన్సిలర్లు చైర్మన్ దృష్టికి సమస్యలు తీసుకు వెళ్లకుండా అధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేయడంతో చైర్మన్ శరత్, టిడిపి కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. దీంతో ఇరువర్గాలు మధ్య వాగ్వివాదం జరిగింది. సమావేశంలో సమస్యలపై మాట్లాడితే చైర్మన్ దృష్టికి తీసుకుని వెళ్లి సభ మర్యాదులు పాటించాలని టిడిపి కౌన్సిలర్లు కోరారు. గొల్లపల్లిలో సంపూర్ణంగా తాగునీరు అందకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సంపూర్ణంగా తాగునీరు అందించాలని కౌన్సిలర్ సావు శారద కోరారు. పాత పైపులైన్ కావడంతో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఎఇ గుప్తా చెప్పారు. గత నాలుగేళ్లలో ఆరో వార్డులో అభివృద్ధి పనులు జరగలేదని, అభివృద్ధి పనులు చేపట్టి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని కౌన్సిలర్ గెంబలి శ్రీనివాసరావు కోరారు. రోడ్డుకిరువైపులా ఆక్రమణలు తొలగించి ప్రమాదాలను నివారించాలని, మంచినీటి బావులను శుభ్రం చేయాలని ఐదో వార్డు కౌన్సిలర్ వి.హైమావతి కోరారు. చెత్త తరలించే ఎలక్ట్రికల్ వాహనాలన్ని వినియోగంలోకి తీసుకు రావాలని కౌన్సిలర్లు కోరారు. చైర్మన్ ఛాంబర్ ఆధునీకరణకు కేటాయించిన నిధులు రూ.5లక్షలను సక్రమంగా ఖర్చు చేయాలని వైసిపి కౌన్సిలర్లు ఇంటి గోవిందరావు, చోడిగంజి రమేష్ నాయుడు కోరారు. అభివృద్ధి పనులకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

గొడవకు దిగుతున్న టిడిపి, వైసిపి కౌన్సిలర్లు

పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి- ఎస్‌కోట: మండలంలోని శివరామరాజపేట పరిధిలోని బాలకృష్ణరాజపురంలో మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే లలితకుమారి పింఛన్లు పంపిణీ చేశారు.

ఎల్‌కోట: రంగారాయపురంలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పింఛన్లు పంపిణీ చేశారు.

కంటోన్మెంట్: దుప్పాడలోని 43, 44 వార్డులో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పింఛన్లు పంపిణీ చేశారు.

ఎస్‌కోట: పింఛన్ సొమ్మును వృద్ధురాలికి అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్



విజయనగరం: పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే

ఎల్‌కోట: పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల

49 కేసులు.. రూ.4.90 లక్షల జరిమానా

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మద్యం సేవించి వాహనాలు నడిపి, పట్టుబడిన 49 మంది వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానాను విజయనగరం అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ఎస్.హెచ్.ఆర్. తేజ చక్రవర్తి విధించారు. విజయనగరం ట్రాఫిక్ సిఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. మద్యం సేవించి, వాహనాలు నడిపిన వారిపై 49 కేసులు నమోదు చేశారు. అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వద్ద హాజరుపర్చగా, ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం 49 మందికి రూ.4.90 లక్షల జరిమానా విధించారని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురవడం లేదా ఇతర వాహనాలను ఢీకొట్టి ప్రమాదాలకు కారకులవుతున్నారని చెప్పారు. ఈ తరహా వాహనదారులను కట్టడి చేసేందుకు, ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రతిరోజూ నిర్వహిస్తున్న విజిబుల్ పోలీసింగులో భాగంగా ప్రత్యేకంగా డ్రంకన్ డ్రైవ్ చేపట్టి, డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు.

డిఐఒ నరేంద్ర సేవలు చిరస్మరణీయం

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లా ఇన్ఫర్మేటిక్స్ అధికారి ఆర్.నరేంద్ర చేసిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. డిఐసిలో డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నరేంద్ర శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ మురళి, సిపిఒ పి.బాలాజీ, డిఆర్‌డిఎ పీడీ ఎ.కళ్యాణ చక్రవర్తి, వ్యవసాయశాఖ జెడి విటి రామారావు, పశు సంవర్ధకశాఖ జెడి వైవి రమణ, డిపిఆర్‌ఒ డి.రమేష్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఎన్.వెంకటేష్, జిల్లా ఉపాధి అధికారి అరుణ, అసిస్టెంట్ డిఐఒ బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కారు, ఆటో ఢీ.. డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - చీపురుపల్లి, కంటోన్మెంట్

విజయనగరంలోని ఫారెస్ట్ కార్యాలయం అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో చీపురుపల్లి మండలం రాయవలస పంచాయతీ కొత్తపేట గ్రామానికి చెందిన పప్పల శివ (35) అనే ఆటో డ్రైవర్ మృతి చెందాడు. మండలంలోని రైతుల వద్ద నుండి కూరగాయలను కొనుగోలు చేసి నిత్యం విజయనగరం రైతు బజార్‌కు తరలిస్తూ ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్న శివ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబం శోక సంద్రంలో మునిగింది. రోజువారీ పనిలో భాగంగానే చీపురుపల్లి నుండి వేరుశెనగకాయల బస్తాలను ఆటోలో విజయనగరం తరలిస్తుండగా అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో స్పీడ్ బ్రేకర్ల వద్ద ఆటోని నెమ్మది చేయడంతో వెనుక నుండి కారు బలంగా ఢీకొనడంతో ఆటో బోల్తా పడి ఆటో డ్రైవింగ్ చేస్తున్న శివతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించారు. వీరిలో తీవ్రంగా గాయపడిన ఆటో డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి పాప, ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. మండలంలో అందరికీ సుపరిచితుడుగాను మంచి వ్యక్తిగా పేరు గల శివ రోడ్డు ప్రమాదంలో ఆకస్మికంగా మృతి చెందడంతో మండలంతో పాటు రాయవలస పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల ప్రజలు కొత్తపేటలోని శివ స్వగ్రామానికి వెళ్లి పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. విజయనగరంలో శివ పంచినామా అనంతరం చీపురుపల్లి మండలంలోని కొత్తపేట గ్రామానికి మృతదేహాన్ని తరలించి దహన సంస్కారాలు జరిపించారు. ఈ మేరకు విజయనగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బంధువులు వివరించారు. కుటుంబానికి ఆధారమైన శివ మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ఆదుకోవాలంటూ పలువురు కోరుతున్నారు.

మృతుడు శివ(ఫైల్)

ఘటనా స్థలంలో బోల్తా పడిన ఆటో

పొగాకు వ్యతిరేక ర్యాలీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థంలో ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటీ పొగాకు వ్యతిరేక ర్యాలీ నిర్వహించింది. శనివారం రామతీర్థం మిమ్స్ గ్రామీణ వైద్య కేంద్రం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ జిల్లా మెడికల్ ఆఫీసర్ సి.హెచ్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పొగాకు, ధూమపానం వల్ల కలిగే అనర్థాలు వాటి కారణంగా ప్రాణహాని కలగడమే కాకుండా ఆర్థికంగా చాలా మంది జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయని తెలిపారు. వాటి నుంచి దూరంగా ఉండాలని, మార్కెట్‌లలో ఆకర్షణీయ ప్రకటనలు ద్వారా యువత ఎక్కువగా ప్రేరేపితం అవుతున్నారని, ప్రకటనలు పట్ల ఆకర్శితులు కాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం గ్రామీణ వైద్య కేంద్రం పరిసర వీధుల్లో అవగాహవ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు షణ్ముఖ, వాహిని, రెడ్ క్రాస్ జిల్లా కో ఆర్డినేటర్ సి.హెచ్. మన్మథరావు, మిమ్స్ విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొనారు.

పొగ తాగడం ఆరోగ్యానికి హానికరం

కొత్తవలస: పొగ తాగడం ఆరోగ్యానికి హానికరమని వియ్యంపేట పిహెచ్‌సి వైద్యాధికారి గోపాలకృష్ణ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంలో భాగంగా శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఆరోగ్యాన్నే కాదు జీవితాన్ని కూడా కాల్చేస్తుందని, పొగాకుకు దూరంగా ఉండి, ఆరోగ్యంగా జీవించాలని తెలిపారు. పొగాకు వల్ల ఊపిరితిత్తులు, గుండె జబ్బులు, గొంతు కేన్సర్, బ్రెయిన్ స్ట్రోక్, ఊపిరితీసుకోవడంలో లోపం, రక్త ప్రసరణలో లోపం వంటి సమ స్యలు ఏర్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒ నరసింహారావు, పిహెచ్‌ఎన్ జగదాంబ, హెచ్‌వి పద్మావతి, హెచ్‌ఎస్ ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యరావు, ఆప్తాలమిక్ ఆఫీసర్ ఈశ్వరరావు, ఫార్మసీ ఆఫీసర్ ఆశ జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: ర్యాలీ చేస్తున్న సిబ్బంది

యోగాతో మంచి ఆరోగ్యం

ప్రజాశక్తి - భోగాపురం

యోగాతోనే మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చునని మార్కెఫెడ్ రాష్ట్ర అధ్యక్షులు కర్రోతు బంగార్రాజు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం యోగా శిక్షణ కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం నుంచి జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు మీదుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కిషోర్ కుమార్, ఎఒ కామేశ్వరరావు, ఇఒపిఆర్‌డి గాయత్రీ, ఎంఇఒ చంద్రమౌళి, ఎపిఒ భాగ్యలక్ష్మి, ఎపిఎం జగదీష్ సిబ్బంది పాల్గొన్నారు.

భోగాపురం: యోగా చేస్తున్న కర్రోతు, తదితరులు

ముగిసిన యోగా శిక్షణ శిబిరం

వేపాడ: మండలంలో ఎంపిడిఒ ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న యోగా శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. యోగా చేయడం వల్ల ఆరోగ్యవంతంగా ఉండడమే కాకుండా మానసిక ఉల్లాసం కూడా పొందగలమని యోగాలో పాల్గొన్న గ్రామ సచివాల సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, ఉపాధిహామీ టి.ఎ. ఎర్నమ్మ, పిఆర్‌జెఇ ఆలీ, పంచాయతీ కార్యదర్శులు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, ఇఒపిఆర్‌డి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: యోగాలో పాల్గొన్న సిబ్బంది